సాక్షి జగిత్యాల

బుధవారం ◆ 22 ◆ ఫిబ్రవరి ◆ 2023



కొండపై భక్తుల రద్దీ

కొండగట్టు: కొండట్టు శ్రీఆంజనేయస్వామిని మంగళవారం సుమారు పదివేల మందికిపై గా భక్తులు దర్శించుకున్నారు.



'తొలిమెట్టు' పరిశీలన

జగిత్యాల: జిల్లాలోని వివిధ పాఠశాలల్లో చేపట్టిన తొలిమెట్టు కార్యక్రమం అమలు తీరును రాష్ట్రస్థాయి బృందం పరిశీలించింది.

గరిష్ఠం/కనిష్ఠం

35.0/18.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

'డిజిటల్' వ్యాపారులు



- ఈమె పేరు మచ్చ అనిత. ధర్మపురి పట్టణంలో కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. కరోనా నేపథ్యంలో వ్యాపారం సాగలేదు. ఆ తర్వాత పీఎం స్వనిధి ద్వారా రూ.10వేల రుణం తీసుకుంది. కూరగాయల దుకాణం విస్తరించింది. రుణ వాయిదాలను సకాలంలో, సక్రమంగా చెల్లిస్తూ వచ్చింది. దీంతో రెండోవిడతలో రూ.20వేల రుణం మంజూరైంది. వ్యాపారాన్ని అభివృద్ధి చేసి డిజిటల్ లావాదేవీలు జరుపుతోంది.



- ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ కొత్త కొండ పెద్దక్క. ధర్మపురిలో కూరగాయల వ్యాపారం చేసుకుంటోంది. పీఎం స్వనిధి ద్వారా రూ.10 వేల రుణం పొంది సక్రమంగా చెల్లించింది. రెండోవిడతలో రూ.20 వేలు తీసుకుంది. డిజిటల్ పేమెంట్ల ద్వారా ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తోంది. తద్వారా కష్టమర్లతో చిల్లర సమస్య తగ్గిందని ఆమె చెబుతోంది.



ఆన్‌లైన్ పద్ధతిలో చెల్లింపులు చేస్తున్న వినియోగదారులు

- ఆన్‌లైన్ లావాదేవీలపై ఆసక్తి
- ఫోన్‌పే, గూగుల్‌పేపై, పేటీఎంపై దృష్టి
- ప్రోత్సాహకాలిస్తున్న కేంద్రప్రభుత్వం
- అవగాహన కల్పిస్తున్న మెప్మా యంత్రాంగం
- ఆధునికత వైపు స్ట్రీట్ వెండర్స్ అడుగులు

జగిత్యాల: జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో వీధివ్యాపారులను గుర్తించిన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) అధికారులు.. వ్యాపార లావాదేవీలను పూర్తిగా డిజిటల్(ఆన్‌లైన్) పద్ధతిన జరిపేందుకు ప్రోత్సహిస్తున్నారు. వినియోగదారులు సంపూర్ణంగా నగదు రహిత చెల్లింపులు చేస్తే ఎలా స్వీకరించాలనే అంశంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇదేసమయంలో కేంద్రప్రభుత్వం అందిస్తున్న రుణ సదుపాయం, ప్రోత్సాహకాల గురించి కూడా వివరిస్తున్నారు. ఈప్రక్రియ జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ బల్దియాల్లో ప్రస్తుతం జోరందుకుంది.

కరోనా ప్రభావం నుంచి గట్టెక్కేందుకు..

కరోనా నేపథ్యంలో వ్యాపారాల సాగక స్ట్రీట్ వెండర్స్ బతుకులు రోడ్డున పడ్డాయి. వారిని ఆదుకునేందుకు కేంద్రప్రభుత్వం పీఎం స్వనిధి పథకం ప్రారంభించింది. మెప్మా ఆధ్వర్యంలో వీధివ్యాపారులను గుర్తించి అర్హులైన వారందరికీ గుర్తింపు కార్డులు అందజేసిది. తొలివిడతలో రూ.10 వేలు, రెండో విడతలో రూ.20 వేలు, మూడోవిడతలో రూ.50 రుణాలు అందించి వ్యాపారాలు అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంది.

లావాదేవీలకు ప్రోత్సాహకాలు..

మున్సిపాలిటీల్లో తోపుడు బండ్లు, కూరగాయలు, కొబ్బరి బొండాలు, పాన్‌టేలాలు, టీస్టాళ్లు, మటన్ షాపులు నడిపేవారిని డిజిటల్ లావాదేవీలు జరిపేలా తొలుత మెప్మా అధికారులు అవగాహన కల్పించారు. వీరికి చిల్లర సమస్య ఎదురు కాకుండా డిజిటల్ చెల్లింపుల ప్రక్రియ అందుబాటులోకి తెచ్చారు. వీధివ్యాపారుల బ్యాంక్ ఖాతాలకు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం తదితర డిజిటల్ యాప్‌లు లింక్ చేశారు. ఫోన్ నంబరు ఆధారంగా ప్రత్యేక క్యూఆర్ కోడ్ కేటాయించారు. ఆన్‌లైన్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. కొత్తవారికి కూడా తర్ఫీదు ఇస్తున్నారు.

కరోనాకు ముందు.. తర్వాత..

డిజిటల్ చెల్లింపులతో క్యాష్‌బ్యాక్

డిజిటల్ చెల్లింపులతో చిరువ్యాపారులకు మేలు జరుగుతుంది. వీధివ్యాపారులను గుర్తించి అందరికీ క్యూఆర్ కోడ్ కేటాయిస్తున్నాం. ఆన్‌లైన్ చెల్లింపులతో క్యాష్‌బ్యాక్ కూడా వస్తుంది. కేంద్రప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. – సునీత, మెప్మా అధికారి

రెండోదశలో రుణ లక్ష్యం, దరఖాస్తులు, మంజూరు వివరాలు

బల్దియా	వ్యాపారులు	రుణలక్ష్యం	దరఖాస్తులు	మంజూరు	అందించినవి	అందించాల్సినవి
ధర్మపురి	858	386	490	391	372	19
రాయికల్	815	418	484	355	321	34
మెట్‌పల్లి	3548	1429	1596	1039	773	266
కోరుట్ల	4081	1854	2026	1392	1359	33
జగిత్యాల	6005	2472	2360	1569	1331	238
మొత్తం	15,307	6559	6956	4746	4156	590

వీధి వ్యాపారులకు వరం..

రహదారులు, వీధుల్లో తోపుడు బండ్లు, బట్టల వ్యాపారం చేసుకునే వారికి సాంత్వన కలిగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకం అందుబాటులోకి తెచ్చింది. కోవిడ్ అనంతరం ప్రారంభమైన ఈ పథకం వీధివ్యాపారులకు వరంగా మారింది. ఇప్పటికే సర్వే చేసి వీధివ్యాపారులను గుర్తించిన అధికారులు.. తొలివిడతలో రూ.10వేలు రుణం అందించింది. 7శాతం వడ్డీతో రుణవాయిదాలు సక్రమంగా చెల్లించిన వారికి రెండోదశలో రూ.20వేల రుణం మంజూరు చేశారు. మూడోదశలో రూ.50వేలు మంజూరు చేస్తున్నారు. ఈ సొమ్ముతో తమ వ్యాపారాలు అభివృద్ధి చేసుకుంటూ వడ్డీ వ్యాపారుల బారినుంచి వీధి వ్యాపారులు బయటపడతారని మెప్మా అధికారులు అంటున్నారు.

న్యూస్‌రీల్

సర్పంచ్ భర్తపై చర్య తీసుకోవాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): వేములకుర్తి సర్పంచ్ సున్నం నవ్యశ్రీ భర్త సత్యంపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కురిసెంగ వేణు డిమాండ్ చేశారు. ఈమేరకు డిప్యూటీ తహసీల్దార్ పద్మకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ నుంచి సుమారు 40ఏళ్ల క్రితం వేములకుర్తికి వచ్చి స్థిరపడ్డామని, సొంతంగా ఇళ్లు కట్టుకుని బతుకుతున్నామని అన్నారు. కానీ, సర్పంచ్ భర్త సున్నం సత్యం.. తమను గ్రామం విడిచి వెళ్లిపోవాలని వేధిస్తున్నారని ఆవేదన చెందారు. దివ్యాంగులు, మృతుల కుటుంబాలనూ వదిలిపెట్టడంలేదని ధ్వజమెత్తారు. బతుకు దెరువు కోసం వచ్చిన తమను ఊరు విడిచి వెళ్లిపోవాలంటున్న సత్యంపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ దళిత హక్కుల పోరాట సమితి రాయికల్ మండల కన్వీనర్ జంగిలి సుదర్శన్, నాయకులు రాటం గంగు, మహేశ్, మాచర్ల వనజ, గంపల లక్ష్మీ, మాచర్ల లక్ష్మణ్, ఎర్రొల్ల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం



మాట్లాడుతున్న డాక్టర్ జైపాల్‌రెడ్డి

కోరుట్ల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో తొలికాన్పులో సాధారణ ప్రసవానికే ప్రాధాన్యం ఇస్తున్నామని మాతా, శిశు సంరక్షణ అధికారి జైపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. వైద్యసేవలు, సమస్యల గురించి గర్భిణులతో మాట్లాడి తెలుసుకున్నారు. వారికి సీఎం కేసీఆర్ కిట్ అందజేశారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏఎన్ఎం, ఆశవర్కర్ల పనితీరు గురించి సూపర్‌వైజర్లను అడిగి తెలుసుకున్నారు. 102 వాహన సేవలు, రూట్ మ్యాప్ గురించి సమీక్షించారు. వైద్యులు సునీతారాణి, శ్రీలక్ష్మి, సమీన, అనిల్, సింధు, సూపర్‌వైజర్లు ధనుంజయ, భూషణ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మకరంద్

జగిత్యాలరూరల్: గ్రామాల్లోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మకరంద్ సూచించారు. జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్తి పన్ను వందశాతం వసూలు చేయాలని, ట్రాక్టర్ రుణవాయిదాలను సకాలంలో చెల్లించాలని పేర్కొన్నారు. నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, మన ఊరు.. మన బడి కార్యక్రమాల అమలుపై ప్రత్యేక చొరవ చూపాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వరి, సూపరింటెండెంట్ గంగాధర్, ఏపీవో రవిబాబు పాల్గొన్నారు.

పరిహారం చెల్లిస్తాం



మాట్లాడుతున్న అధికారులు

కోరుట్లరూరల్: యూసుఫ్‌నగర్‌లో ఇటీవల కరెంట్ తీగ తెగిపడి విద్యుదాఘాతంతో మృతి చెందిన ఈశ్వరమ్మ కుటుంబాన్ని ట్రాన్స్‌కో అధికారులు మంగళవారం పరామర్శించారు. విద్యుత తీగ తెగిపడటం దురదృష్టకరమని ఎస్ఈ సత్యనారాయణ అన్నారు. ఈశ్వరమ్మ కుటుంబానికి తమ సంస్థ తరపున త్వరలోనే పరిహారం చెల్లిస్తామని అభయం ఇచ్చారు. ఆమె కుమారులు హన్మాండ్లు, అంజయ్యను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ తిరుపతి, ఏడీఈ ఆంజనేయులు, ఏఈ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరక్టర్ గుగ్గిళ్ల సురేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకు సంక్షేమ ఫలాలు



వివరాలు సేకరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాలజోన్: జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవ చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంత కోరారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో విద్య, వైద్యం, సాంఘిక సంక్షేమం, స్త్రీ, శిశు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, ఆర్థిక, ప్రణాళికస్థాయీ సంఘాల సలహా సమావేశం మంగళవారం దావ వసంత అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జిల్లాలో మెడికల్ కళాశాల, అన్ని వసతులతో ఆధునిక వైద్యశాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. విద్యుత్ రంగంలో సమూల మార్పులు తేవడంతోపాటు ఏ రాష్ట్రంలో లేనివిధంగా 24 గంటల పాటు నిరంతర విద్యుత్‌ను అందిస్తున్నామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా దళితుల అభివృద్ధి కోసం దళితబంధు కార్యక్రమం అమలు చేస్తున్నామని అన్నారు. జెడ్పీ సీఈవో రామానుజాచారి, స్థాయీ సలహా సంఘం సభ్యులు భూమయ్య, అరుణ, షేక్ అమ్జద్, ప్రశాంతి, లావణ్య, రాజేందర్, రామ్మోహన్ రావు, మహేశ్, జలేందర్, మనోహర్‌రెడ్డి, భారతి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే..



గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

సారంగాపూర్(జగిత్యాల): ప్రజా సమస్యలను సమగ్రంగా తెలుసుకోవడానికే 'మీరు.. నేను' చేపట్టామని, దీనిద్వారా బీర్‌పూర్‌లో పల్లెనిద్ర చేస్తున్నానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి బీర్‌పూర్‌లో పాదయాత్ర చేశారు. గ్రామస్తులను పలుకరిస్తూ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ, అభివృద్ధి ఫలాలపై ఆరా తీశారు. బుధవారం ఉదయం ఇంటింటి పర్యటన చేస్తానని తెలిపారు. అనంతరం పల్లెనిద్ర చేశారు. ఉమ్మడి జిల్లా కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారపాక రమేశ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నల్ల మహిపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పని ఎక్కువ.. జీతం తక్కువ

- 15ఏళ్లుగా పనిచేస్తున్నా గుర్తింపులేదు
- నృసింహుని ఆలయ ఉద్యోగి ఆవేదన
- గుడి ఎదుట బైఠాయించి నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగి గంగాధర్

ధర్మపురి: 'సుమారు పదిహేను ఏళ్లుగా గుడిలో పనిచేస్తున్న.. పనిభారం ఎక్కువగా ఉంటంది.. జీతం తక్కువగా ఇస్తున్నరు.. ఇంతచేసినా గుర్తింపు దక్కడంలేదు' అని ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న గంగాధర్ అనే ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశాడు. మంగళవారం ఆలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపాడు. బాధితుడి కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన తుమ్మనపెల్లి గంగాధర్.. స్థానిక శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో తాత్కాలిక ప్రాతిపదికన ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. నీటి సమస్యలే కాదు.. విద్యుత్ సంబంధిత సమస్యలూ సరిచేస్తున్నాడు. నెలకు రూ.6వేల వేతనంపై 15ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఎప్పటికైనా నర్సింహస్వామి కరుణించి వేతనం పెంచకపోతాడా? అనే నమ్మకంతో తక్కువ వేతనంతోనైనా పనిచేస్తూ వస్తున్నాడు. ఉదయం నుంచి రాత్రివరకూ ఎక్కడ ఏ సమస్య ఎదురైనా గంగాధరే దిక్కుగా ఉంటున్నాడు. వేతనం పెంచాలని ఆలయ అధికారులకు విన్నవిస్తూ వస్తున్నా ప్రయోజనం లేకుండాపోతోంది. గంగాధర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బహిరంగ మార్కెట్‌లో పెరిగిన నిత్యావసరాలు, తక్కువ వేతనంతో బతికేదెలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. రెండేళ్లక్రితం ఈపీఎఫ్ సొమ్ము రూ.44వేలు చెల్లించినా లెక్కాపత్రం లేదని గంగాధర్ ఆవేదన వ్యక్తం చేశాడు. నలుగురిని కాంట్రాక్టు బేసిక్ కింద ఎంపిక చేసుకున్నా.. తనకు అవకాశం ఇవ్వలేదని అన్నాడు. అధికారుల నిర్లక్ష్యంతోనే ఇదంతా జరుగుతోందని ఆరోపించాడు. తక్షణమే తన వేతనం పెంచి ఆదుకోవాలని అధికారులకు విన్నవించాడు.

దుబ్బరాజన్న ఆదాయం రూ.60లక్షలు



నగదు లెక్కిస్తున్న మహిళలు

సారంగాపూర్(జగిత్యాల): శ్రీదుబ్బరాజన్న బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి రూ.60,29,160 ఆదాయం సమకూరింది. హుండీ ద్వారా రూ.27,87,975 నగదు, అర్చనలు, అభిషేకాలు, ప్రసాదాలు, పూజాకార్యక్రమాలు, టికెట్ల ద్వారా రూ.22,59,185 నగదు, మిగిలిన సొమ్ము టెండర్ల ద్వారా సమకూరినట్లు ఆలయ అధికారులు వివరించారు. మిశ్రమ బంగారం 47 గ్రాములు, మిశ్రమ వెండి పది కిలోల మూడువందల గ్రాములు సమకూరాయని పేర్కొన్నారు. ఆలయ ఈవో కోన్న కాంతారెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త పొరండ్ల శంకరయ్య, ఎంపీపీ కోల జమున, సర్పంచులు బొడ్డుపల్లి రాజన్న, ఆకుల జమున, సింగిల్‌విండో చైర్మన్ గుర్నాథం మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ తోడేటి శేఖర్‌గౌడ్, భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

- డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి



అభినందిస్తున్న డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి

జగిత్యాల: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. ఈనెల 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్, జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మంగళవారం జిల్లా కేంద్రంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈనెల 13న మండలస్థాయిలో నిర్వహించిన పోటీల్లో మండలానికి ఇద్దరు చొప్పున విద్యార్థులను ఎంపికచేశారు. వీరు టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యారు. డీఈవో మాట్లాడుతూ, టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో పాల్గొంటారన్నారు. కొడిమ్యాల మండలం రాంసాగర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఎల్.విజయ్ ప్రథమ, జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని బి.వైష్ణవి ద్వితీయస్థానంలో నిలిచారని ఆయన తెలిపారు. ఈనెల 25న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని వివరించారు. ఇద్దరు విద్యార్థులను డీఈవో అభినందించారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, కామన్ పరీక్షల బోర్డు కార్యదర్శి మురళీమోహనచారి, ఫిజికల్ సైన్స్ ఫోరం అధ్యక్షుడు మచ్చ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి నట్టల నివారణ మందు

జగిత్యాలరూరల్: మూగజీవాల సంరక్షణకు ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోందని జిల్లా పశువైద్యాధికారి గోపాలకృష్ణమూర్తి అన్నారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఏటా మూగజీవాలకు వ్యాధులు సోకకుండా నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలో 6.01 లక్షల గొర్రెలు, 0.97 లక్షల మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నామని వివరించారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 48 బృందాలను నియమించామని అన్నారు. రోజూ 48 గ్రామాల్లో గొర్రెలు, మేకల నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తామని, ఈ ప్రక్రియ ఈనెల 22–28 వరకు కొనసాగిస్తామని ఆయన వెల్లడించారు.

భయం భయంగా ప్రయాణం!

- శిథిలమైన కోనాపూర్ పురాతన వంతెన
- వణుకుతూనే రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు
- భయపెడుతున్న రెండు ఉమ్మడి జిల్లాల వారధి



శిథిలమైన సారంగాపూర్-బీర్‌పూర్ వంతెన

సారంగాపూర్(జగిత్యాల): అది రెండు ఉమ్మడి జిల్లాల వారధి.. పురాతనమైనది.. రెండేళ్ల క్రితమే శిథిలమైంది.. అయినా, గత్యంతరం లేక దానిపైనుంచే రాకపోకలు సాగిస్తున్నారు.. ఎప్పుడు కూలుతుందో తెలియక, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకు జీవుడా అంటున్నారు.. జగిత్యాల జిల్లా సారంగాపూర్ – మంచిర్యాల జిల్లా జన్నారం మార్గంలోని కోనాపూర్ శివారు లో లెవల్ వంతెన తీరు ఇది.

నిత్యం వందలాది వాహనాల రాకపోకలు..

- జిల్లా కేంద్రం నుంచి సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల మీదుగా మంచిర్యాల జిల్లా జన్నారం వరకు ప్రయాణించాలంటే ఇదే ప్రధానమైన మార్గం.
- ఈ ప్రధాన రహదారిపై కోనాపూర్ శివారులో లో లెవల్ వంతెన నిర్మించారు.
- ఇది అతి పురాతనమైనది. రెండేళ్ల క్రితమే పూర్తిగా శిథిలావస్థకు చేరింది.
- రాకపోకలకు ఏమాత్రం అనువుగా లేదని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.
- అయినా, వేరే మార్గం లేక నిత్యం వందలాది పెద్ద, చిన్న వాహనాలు ఈ వంతెనపై నుంచే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది.

జిల్లా కేంద్రానికి 7 కి.మీ. దూరం..

- సారంగాపూర్ మండలం కోనాపూర్ శివారు ఎల్లమ్మ ఆలయం వద్ద నిర్మించిన లో లెవల్ వంతెన జిల్లా కేంద్రానికి సుమారు 7 కి.మీ. దూరంలో ఉంది. జగిత్యాలకు చేరుకోవడానికి సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలతోపాటు మంచిర్యాల జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు ఇదే వంతెనపై ప్రయాణిస్తున్నారు. చిన్నవాటితోపాటు భారీవాహనాలు కూడా రాకపోకలు సాగిస్తున్నాయి. దాదాపు 55ఏళ్ల క్రితం దీనిని నిర్మించారని చెబుతున్నారు. వంతెన లోలెవల్ కావడంతో ఏటా వర్షాకాలంలో వరదల ఉధృతికి వాగులు ఉప్పొంగి రాకపోకలు స్తంభిస్తాయి. మొన్నటి వర్షాకాలంలోని వరదలతో రెండు జిల్లాల మధ్య రాకపోకలు కొన్నిరోజులపాటు నిలిచిపోయాయి.

తాత్కాలిక చర్యలే..

- ఏటా వర్షాకాలంలో వచ్చే వరదలతో పోలీసులు, రెవెన్యూ అధికారులు అప్రమత్తమవుతున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రమాదాలు జరగకుండా వాహనాల రాకపోకలు నిలిపివేస్తున్నారు. కానీ, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల తోపాటు మంచిర్యాల జిల్లావాసులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ముఖ్యంగా ఆస్పత్రులకు వెళ్లేవారు ఏటా వర్షాకాలంలో నరకం అనుభవిస్తున్నారు. వరదల సమయంలో జిల్లా కేంద్రానికి చేరుకోవాలంటే కొన్ని కిలోమీటర్లు అదనంగా ప్రయాణం చేయాల్సి వస్తోంది.

తాత్కాలిక మరమ్మతులతోనే సరి..

- లో లెవల్ వంతెనకు ఆర్ అండ్ బీ అధికారులు తరచూ తాత్కాలికంగా మరమ్మతులు చేయిస్తున్నారు. అయినా, వంతెన ఒకవైపు కుంగిపోతోంది. పైపులు కూడా నేలలో కుంగిపోయాయి. వంతెన ఏ క్షణమైనా కూలిపోవచ్చనే ఆందోళన నెలకొంది. అయినా మొన్నటి దుబ్బ రాజన్నజాతర, బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతరకు లక్షలాది మంది భక్తులు ఈ వంతెన పైనుంచే రాకపోకలు సాగించారు. గమ్యం చేరేవరకూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నారు.

పనులకు మోక్షం

- పురాతన వంతెన స్థానంలో హై లెవల్ వంతెన నిర్మాణానికి ఇటీవల రూ.5.65కోట్లు మంజూరయ్యాయి. 63 మీటర్ల పొడవు, 10 అడుగుల ఎత్తుతో వంతెన నిర్మిస్తారని అధికారులు చెబుతున్నారు. అయితే, పనులను వచ్చే జూన్ నాటికి పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు ప్రారంభించాలి



గోదావరిపై కమ్మునూర్–కలమడుగు మధ్య వంతెన నిర్మాణంతో సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల మీదుగా జగిత్యాలకు మంచిర్యాల జిల్లా నుంచి రాకపోకలు భారీగా పెరిగాయి. వాహనాలు నిత్యం నడుస్తూనే ఉన్నాయి. లో లెవల్ వంతెన నిర్మిస్తే వ్యాపారాలు పెరిగి సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలు మరింత అభివృద్ధి చెందుతాయి. – ఆకుల జమున, సర్పంచ్, కోనాపూర్

వర్షాకాలంలో సమస్యలు



ప్రతీ వర్షాకాలంలో అత్యవసర సమయాల్లో ప్రజలు జగిత్యాల వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెన పైనుంచి వరద పారడంతో రాకపోకలు స్తంభిస్తున్నాయి. త్వరగా వంతెన పనులు చేపట్టాలి.

– బొడ్డుపల్లి రాజన్న, సర్పంచ్, పెంబట్ల

జూన్ నాటికి పనులు పూర్తి



కోనాపూర్ శివారుల్లో ఆర్ అండ్ బీ రోడ్డుపై రూ.5.65 కోట్లతో చేపట్టే వంతెన పనులు జూన్ నాటికి పూర్తిచేయాలనుకుంటున్నాం. ఎమ్మెల్యే చేతుల మీదుగా పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నాం. – రాజశేఖర్, ఏఈ ఆర్ అండ్ బీ

క్లుప్తంగా

క్రీడలపై దృష్టి సారించాలి



జెండా ఊపి పోటీలు ప్రారంభిస్తున్న నవీన్‌రావు

మెట్‌పల్లి(కోరుట్ల): విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలని బీజేపీ నాయకుడు సురభి నవీన్‌రావు సూచించారు. పట్టణంలోని మినీ స్టేడియంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా టీం ఎంపిక కోసం క్రీడా పోటీలు నిర్వహించారు. నవీన్‌రావు జెండా ఊపి పోటీలు ప్రారంభించారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించగా, జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆల్‌రౌండర్ గంగాధర్, అశోక్, కొమురయ్య, చక్రధర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్‌కు అభినందన

జగిత్యాలరూరల్: సంగంపల్లి గ్రామానికి చెందిన గుగ్గిళ్ల వెంకటేశ్ వృత్తిరీత్యా వడ్రంగి పనిచేస్తాడు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ యాస్మిన్ బాషాపై అభిమానంతో రెండు రోజుల పాటు శ్రమించి కలెక్టర్ నేమ్‌ప్లేట్‌ను టేకు కర్రతో తయారు చేశాడు. మంగళవారం సాయంత్రం కలెక్టర్‌ను కలిసి నేమ్‌ప్లేట్ అందజేశారు. వెంకటేశ్‌ను కలెక్టర్ అభినందించారు.

50 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలి



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

రాయికల్(జగిత్యాల): చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి 50 శాతం రిజర్వేషన్ కల్పించేలా ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కేంద్ర, రాష్ట్రమంత్రివర్గంలో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేశ్, రాంచందర్, గంగదరి సురేశ్, ఆసరి మల్లేశ్, బత్తిని నాగరాజు, సాయిరాజ్, సామల్ల సతీశ్, మోత్కూరి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆవిరి యంత్రంతో కూలీల కొరతకు చెక్

- అందుబాటులోకి పసుపు ఉడకబెట్టే మిషన్
- నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పసుపు తయారీ
- రోజుకు 100 క్వింటాళ్ల వరకు ఉడకబెట్టే సామర్థ్యం
- సులభతరమైన పసుపు రైతుల పనులు



ఆవిరి యంత్రంతో పసుపు ఉడకబెడుతున్న రైతులు, కూలీలు

జగిత్యాలఅగ్రికల్చర్: అంతర్జాతీయంగా, జాతీయంగా పసుపు ఎగుమతి వేగవంతమవుతోంది. అయితే, ఈక్రమంలో రైతులు పంటలో నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సి వస్తోంది. మొన్నటివరకు కడాయిలపై పసుపు ఉడకబెట్టేందుకు పసుపు రైతులు నానా తిప్పలు పడేవారు. ఇలాచేస్తే నాణ్యతా ప్రమాణాలు ఆశించిన మేరకు రాలేదు. ప్రస్తుతం ఆధునిక ఆవిరి యంత్రం అందుబాటులోకి వచ్చింది. దీనిద్వారా పసుపు ఉడకబెడితే కూలీల కొరత తప్పడంతోపాటు అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పసుపు ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

రైతుల కష్టాలు అనేకం..

- గతంలో పసుపు ఉడకబెట్టేందుకు రైతులు సుమారు నెలపాటు తిప్పలు పడేవారు.
- తొలుత పసుపు కొమ్ములు ఉడకబెట్టే రెండు నెలల ముందే రైతులు గుట్టలకు వెళ్లి కట్టెలు తెచ్చి ఎండబెట్టేవారు.
- పసుపును ఉడకబెట్టే సమయంలో ఒకరోజు ముందు కట్టెలు మండేందుకు వీలుగా ఇద్దరు పొయ్యి తయారు చేసుకునేవారు.
- ఆ తర్వాత, దానిపై ఎడ్లబండ్లకు ఇరుసుగా ఉండే ఇనుపరాడ్లను బిగించేవారు.
- వీటిపై కడాయిలు పెట్టి, అందులో పసుపు పోసి, దానికి తగ్గట్టు కరెంట్ మోటార్ నుంచి నీరు తెచ్చి పసుపు కొమ్ములు మునిగే వరకూ నీరు పోసేవారు.
- ఆ తర్వాత పొయ్యికింద మంట పెట్టి పసుపు కొమ్ములు ఉడకబెట్టేవారు.
- దాదాపు 50 నిమిషాల వరకు ఉడికిస్తే తెల్లని నురగ పొగతోపాటు పసుపు వాసన విరజిమ్ముతూ వచ్చేది.
- ఉడికిన పసుపును చేతితో నొక్కి చూసి, అప్పుడు ఉడికితే కడాయిలను అన్నదాతలు కిందకు దించేవారు.
- ఈ పద్ధతిలో పసుపు ఉడకబెట్టేందుకు కనీసం 10 మంది కూలీలు అవసరమయ్యేవారు.
- పసుపును కలియబెట్టేటప్పుడు పసుపు కొమ్ములు విరిగిపోయేవి.
- ఇంత చేసినా.. కొన్నికొమ్ములు ఉడకక, మరికొన్ని ఎక్కువగా ఉడికి నాణ్యత కోల్పోయి మార్కెట్లో ధర పలికేది కాదు.

బాధలు తీర్చిన ఆవిరి యంత్రం

- జిల్లాలో దాదాపు 50 వేల ఎకరాల్లో పసుపు సాగు చేస్తారు. 8లక్షల మెట్రిక్ టన్నుల -9 లక్షల మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి వస్తోంది. అయితే, పసుపును ఉడకబెట్టే ఆవిరి యంత్రం రావడంతో రైతుల బాధలు తప్పాయి. గ్రామానికి ఒకట్రెండు యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. ఇందులో పసుపు ఉడకబెట్టేందుకు మహారాష్ట్ర నుంచి కూలీలు వచ్చారు. ఆయా ప్రాంతాలు, రైతుల డిమాండ్‌ను బట్టి ఉడకబెట్టినందుకు డ్రమ్ముకు రూ.100 – రూ.150 వరకు కూలి తీసుకుంటున్నారు. పాత పద్ధతిలో ఎకరం పసుపు ఉడకబెట్టేందుకు 10 ట్రాక్టర్ లోడ్‌ల కట్టెలు అవసరమైతే, ఆవిరి యంత్రంతో ఒక ట్రాక్టర్‌తో పసుపును ఉడకబెట్టవచ్చు. కడాయిలో నీరు సరిగ్గా పోయలేక బురద నీరును పోస్తుండేవారు. ప్రస్తుతం ఆవిరి యంత్రంలో ఒకసారి నీరు పోస్తే కనీసం 60 డ్రమ్ముల పసుపును ఉడకబెట్టవచ్చు. ఒకరోజులోనే 100 – 150 డ్రమ్ముల పసుపు ఉడకబెట్టవచ్చు.

ఆవిరి యంత్రం ఇలా పనిచేస్తుంది..

- పసుపును ఉడకబెట్టే యంత్రం ట్రాక్టర్ ట్రాలీ మాదిరిగా ఉండి, నాలుగు టైర్లు ఉంటాయి.
- దీనిని ఒకచోటు నుంచి మరోచోటుకు ట్రాక్టర్ ద్వారా తేలికగా తీసుకెళ్లవచ్చు.
- ఇందులో సుమారు 1,000 లీటర్ల నీరు పట్టే ట్యాంక్ ఉంటుంది.
- దీనికి ఇరువైపులా నాలుగు పెద్ద డ్రమ్ములు ఉంటాయి.
- వీటిని పైపుల ద్వారా నీటి ట్యాంక్‌కు అనుసంధానం చేస్తారు.
- ఉడకబెట్టాల్సిన పసుపును ముందుగా నాలుగు డ్రమ్ముల్లో నింపుతారు.
- ఆ తర్వాత నీరు ఉన్నట్యాంక్ కింద కట్టెలతో మంట పెడతారు.
- ట్యాంక్‌లోని నీరు బాగా మరిగిన తర్వాత పైపుల ద్వారా ఆవిరి పసుపు కొమ్ములతో నింపిన డ్రమ్ముల్లోకి వెళ్తుంది.
- ఈ పద్ధతిలో తొలిసారి నీరు వేడెక్కడానికి కొంత ఎక్కువ సమయం పట్టినా.. తర్వాత తక్కువ సమయం తీసుకుంటుంది.
- ట్యాంక్ నుంచి నీటి ఆవిరిని డ్రమ్ముల్లోకి పంపించే మార్గంలో అవసరమైనప్పుడు పంపి, అవసరం లేనప్పుడు నిలిపివేయడానికి వీలుగా గేట్ వాల్వులు ఉంటాయి. వీటిద్వారా ఆవిరి వృథా కాదు.
- ట్యాంక్‌పై ఉష్ణోగ్రతను తెలిపే మీటర్ అమర్చి ఉంటుంది.
- దీనిద్వారా పసుపు ఉడికింది, లేనిదీ రైతులు సులభంగా తెలుసుకోవచ్చు.
- పసుపు కొమ్ములు ఉడకగానే ఆవిరి యంత్రం గేట్ వాల్వ్‌లు బంద్ చేస్తారు.
- తర్వాత, డ్రమ్ముల కింద ఓపెన్ చేసి, ఉడికిన కొమ్ముల్ని వెంటనే రెండు చక్రాలపై తీసుకెళ్లి ఆరబోస్తారు.

గతంలో నాలుగైదు రోజులు పట్టేది



గతంలో పసుపును ఉడకబెట్టేందుకు నాలుగైదు రోజులు పట్టేది. ఇప్పుడు ఆవిరి యంత్రం రావడంతో ఉడకబెట్టడం తేలికైంది. ఒక్కరోజులోనే పనిపూర్తవుతుంది. పసుపు కొమ్ములు కూడా సరిగ్గా ఉడకడంలేదనే బెంగ ఉండదు. ఈ యంత్రం రైతులకు వరంగా మారింది.
– బద్దం రమేశ్‌రెడ్డి, ఇటిక్యాల, రాయికల్

శ్రమ లేదు.. ఖర్చు తక్కువ



ఆవిరి యంత్రం రావడం వల్ల రైతులకు శ్రమ లేదు, ఖర్చు తప్పింది. ఒకప్పుడు పసుపు ఉడకబెట్టేందుకు కట్టెలతోపాటు పొయ్యిలు తవ్వడం, ఉడకబెట్టేందుకు నానాతిప్పలు పడేవాళ్లం. ఇప్పుడు ఆ శ్రమ తప్పింది. చాలా మంది రైతులు దీనిని ఉపయోగిస్తున్నారు.
– ఏలేటి జలేందర్, ఇటిక్యాల, రాయికల్

కథలాపూర్‌లో జెండాల తొలగింపుపై వివాదం

కథలాపూర్(కోరుట్ల): మండలకేంద్రంలోని కూడలి వద్ద ఏర్పాటు చేసిన జెండాలను తొలగించిన విషయంలో మంగళవారం గ్రామంలో వివాదం నెలకొంది. గ్రామ కూడలి వద్ద మూడురోజుల క్రితం యువకులు ఏర్పాటు చేసిన జెండాలను తొలగించినట్లు మంగళవారం ఉదయం గుర్తించారు. యువకులు కూడలి వద్దకు చేరుకోగా కాసేపు వివాదం నెలకొనగా.. జెండాలను యథావిధిగా పంచాయతీ సిబ్బందితో ఏర్పాటు చేయించడంతో వివాదం సద్దుమణిగింది.

చౌకధరల దుకాణం సీజ్

జగిత్యాలరూరల్/మల్లాపూర్(కోరుట్ల): మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామంలో జంగ మల్లయ్యకు చెందిన రేషన్ దుకాణం నంబరు 2711014లో మంగళవారం తనిఖీలు నిర్వహించగా బియ్యం నిల్వల్లో అధిక మొత్తంలో వ్యత్యాసం వచ్చిందని, దీంతో ఆయనపై 6ఏ కేసు నమోదు చేశామని జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్ తెలిపారు. రేషన్ దుకాణంలో నిల్వఉన్న బియ్యాన్ని భద్రత నిమిత్తం ఒబులాపూర్ గ్రామంలోని గుండు మహిపాల్ రేషన్ దుకాణానికి తరలించినట్లు తెలిపారు. రేషన్ దుకాణాల్లో తనిఖీలు చేసేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని, డీలర్లు బియ్యం నిల్వంలో ఎలాంటి వ్యత్యాసం లేకుండా చూసుకోవాలని సూచించారు. స్టాక్ బోర్డు, ఫిర్యాదుల పెట్టె తప్పని సరిగా ఏర్పాటు చేయాలని అన్నారు. కార్డుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని చెప్పారు.

'బీసీలకు అన్యాయం చేశారు'

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్లో బీసీలకు అన్యాయం జరిగిందని తెలంగాణ బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శికారి గోపీకృష్ణ విమర్శించారు. పట్టణంలో ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనాభాలో 54 శాతానికి పైగా ఉన్న బీసీలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో 5.77లక్షల మంది బీసీలు రుణాల కోసం దరఖాస్తు చేసుకుంటే కేవలం 50వేల మందికే రూ.50 వేల చొప్పున మంజూరు చేశారని పేర్కొన్నారు. బీసీల వాటా పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తుమ్మనపెల్లి రాజేంద్రప్రసాద్, నాయకులు మిట్టపెల్లి రమణ, బెజ్జారపు ప్రవీణ్, జంగిలి విజయ్, మారుతి, జగదీశ్వర్, నితీన్, మురళి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాన్ని ఎందుకు సందర్శించలేదు?

- కొప్పుల ఈశ్వర్ రాష్ట్రానికి మంత్రా..ధర్మపురికా?
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి

ధర్మపురి: కొప్పుల ఈశ్వర్ రాష్ట్రానికి మంత్రా? లేక ఒక ధర్మపురి నియోజకవర్గానికా? అని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రశ్నించారు. పట్టణంలోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం జిల్లా మదిర మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల బాలికల పాఠశాలలో నాణ్యమైన భోజనం అందించడం లేదని ప్రశ్నించిన పాపానికి ప్రిన్సిపాల్.. బాలికలను చితక బాదారని ఆరోపించారు. ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిందని అన్నారు. సంక్షేమ మంత్రిగా వ్యవహరిస్తున్న కొప్పుల ఈశ్వర్ ఇప్పటికీ వసతి గృహాన్ని సందర్శించక పోవడం బాధాకరమన్నారు. బాలికలను చితకబాదిన ప్రిన్సిపాల్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. రాష్ట్రంలో 1,750 ఎస్సీ, మైనార్టీ, బలహీన వర్గాలకు చెందిన గురుకులు ఉన్నాయని, అందులో సుమారు 2.5 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని ప్రభుత్వం చెబుతున్నా.. కనీస వసతులు కల్పించని వసతి గృహాలు అనేకం ఉన్నాయని చెప్పారు. అందులో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి మనుమడు తినే ఆహారాన్ని గురుకులాల్లో పెడుతున్నామని అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించడం కాదని.. దమ్ముంటే వసతి గృహాల్లో ఒకరోజు నిద్రించి భోజనం, వసతులు పరిశీలించాలని హితవు పలికారు. మంత్రికి ధర్మపురి నియోజకవర్గంపై ఉన్న ప్రేమ రాష్ట్ర ప్రజలపై లేదని ఎద్దేవా చేశారు. క్రికెట్ పోటీలు, ఉగాది ఉత్సవాలపై ఉన్న మమకారం బలహీన వర్గాలపై లేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వం తక్షణం స్పందించి బాలికలను కొట్టిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.దినేశ్, ఉపాధ్యక్షుడు వేముల రాజు, నాయకులు సింహరాజు ప్రసాద్, సీపతి సత్యనారాయణ, రాందేని మొగిలి, సుముఖ్, అశెట్టి శ్రీనివాస్, అప్పం తిరుపతి పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ



మాట్లాడుతున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ

కథలాపూర్(వేములవాడ): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను బీజేపీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ సూచించారు. మంగళవారం దుంపేట, అంబారిపేట గ్రామాల్లో ప్రజా గోస.. బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం పేదల కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించి పాలిస్తోందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు కంటె సత్యనారాయణ, నాయకులు మల్యాల మారుతి, వెంకటేశ్వర్‌రావు, శ్రీరాముల ప్రకాశ్, జలంధర్‌రెడ్డి, చౌదరి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేసులు బనాయిస్తే ఊరుకునేదిలేదు

- వైఎస్సార్‌టీపీ నేత గాదే స్రవంతి



మాట్లాడుతున్న గాదే స్రవంతి

కొడిమ్యాల(చొప్పదండి): ప్రజాస్వామ్య బద్ధంగా చేపట్టిన పాదయాత్రను అడ్డుకునేందుకు వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై అక్రమ కేసులు నమోదు చేస్తే ఊరుకునేది లేదని ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గాదే స్రవంతి హెచ్చరించారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. షర్మిల నిర్వహిస్తున్న పాదయాత్రకు వస్తున్న అపూర్వమైన స్పందనను చూసి తట్టుకోలేని ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పర్యటనను అడ్డుకోవడానికి కుతంత్రాలు పన్నుతున్నారన్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహిస్తున్న పాదయాత్రను అడ్డుకుంటే ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని ఆమె పేర్కొన్నారు. మహిళా కమిషన్, గవర్నర్, డీజీపీ స్పందించి పర్యటనను అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూమయ్య, లక్ష్మణ్, సువర్ణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి చెంతకు బాలుడు



బాలుడిని తల్లికి అప్పగించిన పోలీసులు

సిరిసిల్లక్రైం: తప్పిపోయిన బాలుడిని సిరిసిల్ల టౌన్ పోలీసులు సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల వివరాలు.. ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామానికి చెందిన ఆసన్నగారి రేఖకు కొడుకు, కూతురు సంతానం. కూతురు ఆరోగ్యం బాగలేకపోవడవంతో ఇద్దరు పిల్లలతో సిరిసిల్ల వెంకంపేటలోని ఓ ఆసుపత్రికి వచ్చింది. ఈ క్రమంలో పెద్దవాడైన విశ్వనాథ్ (మూడున్నరేళ్ల అబ్బాయి) ఆడుకుంటూ రోడ్డు మీదకు వెళ్లాడు. కూతురుతో తల్లి ఆస్పత్రిలోనే ఉండిపోగా, బాలుడు రోడ్డుమీద తచ్చాడుతున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బాలుడి ఫొటోలను సిరిసిల్ల వాట్సాప్ గ్రూప్స్‌లో పెట్టగా, గుర్తించిన బాలుడి తల్లి సిరిసిల్ల టౌన్‌పోలీసుస్టేషన్ చేరుకుని కొడుకు అక్కునచేర్చుకుంది. పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది. కాగా గంట వ్యవధిలో బాలుడిని కుటుంబీకులకు అప్పగించిన పోలీసుల తీరును స్థానికులు మెచ్చుకుంటున్నారు.

అక్కపెల్లి రాజన్న ఆదాయం రూ.1.8లక్షలు

ధర్మపురి: శివరాత్రి పర్వదినం సందర్భంగా ధర్మపురిలోని శ్రీఅక్కపెల్లి శ్రీరాజరాజేశ్వర స్వామికి హుండీ ద్వారా సమకూరిన ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఈసందర్భంగా రూ.1,89,974 నగదు, 6 గ్రాముల మిశ్రమ బంగారం, 730 గ్రాములు మిశ్రమ వెండి సమకూరినట్లు దేవస్థానం ఈవో శ్రీనివాస్ తెలిపారు. ఈకార్యక్రమంలో దేవాదాయశాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్ రవి కిషన్, చైర్మన్ ప్రసాద్, రేనోవేషన్ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు బూస ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పోలీసుల అదుపులో నిందితులు

వేములవాడఅర్బన్: 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రైస్ మిల్లుకు తరలిస్తుండగా సీసీఎస్ సీఐ బాలకృష్ణ మంగళవారం పట్టుకున్నారు. సీఐ తెలిపిన వివరాలు.. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తుండగా వేములవాడ పట్టణంలోని హరిహర రైస్‌మిల్‌కు విక్రయించేందుకు తెస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. రెండు ఆటోల్లో తరలిస్తున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, హరిహర రైస్‌మిల్ యజమానులు చేపూరి సంతోష్, బండ శ్రీనివాస్, కటకం వెంకన్న, అక్కిరాల అనిల్‌కుమార్‌పై కేసు నమోదు చేశామన్నారు. అలాగే బియ్యం తరలిస్తున్న పర్వతం నర్సయ్య, పర్వతం వంశీ, గంట సమ్మయ్య, గంట రాజు కూడా కేసు నమోదు చేసి, రెండు వాహనాలను పట్టణ పోలీసులకు అప్పగించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్సై మారుతి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు తిరుపతి, షబ్బీర్, రాజేశం, మహిపాల్, విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోసం యువతి నిరసన

- రోడ్డుపై బైఠాయించిన వివాహిత



రోడ్డుపై బైఠాయించిన వివాహిత సంధ్య

రాయికల్(జగిత్యాల): తనకు న్యాయం చేయాలని కోరుతూ నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన వేల్పుల సంధ్య స్థానిక పాతబస్టాండ్ వద్ద మంగళవారం రోడ్డుపై బైఠాయించింది. బాధితురాలి కథనం ప్రకారం.. వేల్పుల సంధ్యకు మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం బర్లపేట గ్రామానికి చెందిన వేల్పుల సత్యంతో కొద్దిరోజుల క్రితం వివాహం జరిగింది. తనభర్త తనతోపాటు మరో యువతిని మోసం చేసి పెళ్లి చేసుకున్నాడని, ప్రస్తుతం ఆ యువతితో కలిసి రాయికల్‌లో నివాసం ఉంటున్నారని చెప్పింది. ఆయనతో ఏడాదిపాటు కాపురం చేశానని, తన భర్తకు పెళ్లి అయిన విషయం తెలియదని, ఈ విషయంపై అక్కడి పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారని తెలిపింది. అయితే, ఆ కేసును ఉపసంహరించుకోవాలని పలుమార్లు తనను భర్త బెదిరించి ఇంట్లోంచి బయటకు నెట్టారని ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్తపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ సుమారు అర్ధగంటపాటు రోడ్డుపై ధర్నా చేసింది. సమాచారం అందుకున్న పోలీసులు.. సంఘటన స్థలానికి చేరుకుని బాధితురాలితో మాట్లాడారు. తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించింది.

జగ్గారావుపల్లెలో చిరుత కలకలం?



రైతులు గుర్తించిన పాదముద్రలు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి జగ్గారావుపల్లె శివారు తూము కుంట చెరువు పరిసర ప్రాంతాల రైతులకు చిరుత భయం పట్టుకుంది. సిరిసిల్ల పట్టణ శివారు ప్రాంతాలైన చిన్నబోనాల, పెద్దబోనాలలో గతంలో చిరుత సంచరించి లేగదూడలపై దాడి చేసిన ఘటనలు ఉన్నాయి. పది రోజుల క్రితం తంగళ్లపల్లి మండలం గోపారావుపల్లె గ్రామ శివారులో ఓ షెడ్డులో కట్టేసిన దూడపై దాడి చేసి చంపివేసింది. తాజాగా జగ్గారావుపల్లె శివారులో చిరుత పాదముద్రలు గుర్తించినట్లు రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి చిరుతను పట్టుకోవాలని కోరుతున్నారు.

కిడ్నాప్ కేసు నమోదు

మానకొండూర్: వెల్దికి చెందిన ఓ బాలిక ఈ నెల 13 నుంచి కనిపించడం లేదని సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. బాధితురాలి తండ్రి మంగళవారం మానకొండూర్ ఠాణాలో ఫిర్యాదు చేయగా కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించామని, ఆచూకీ లభించలేదన్నారు.

స్వగ్రామానికి గణేశ్ మృతదేహం



గణేశ్ అంతిమయాత్రలో గ్రామస్తులు

మల్లాపూర్(కోరుట్ల): ఉపాధి కోసం కువైట్ వెళ్లి ఈ నెల 16న మృతి చెందిన కొత్తదాంరాజుపల్లి గ్రామానికి చెందిన సుంకె గణేశ్(38) మృతదేహం మంగళవారం స్వగ్రామానికి చేరుకుంది. శవపేటికను చూసిన తల్లిదండ్రులు సుంకె పెద్దగంగరాం–గంగు, భార్య రాజేశ్వరి, కుమారుడు రోహన్‌రాజు, కుమార్తె రిహన్‌శ్రీ బోరున విలపించారు. అక్కడి ఓ కంపెనీలో పనిచేస్తుండగా ఈనెల 8న హైబీపీతో కుప్పకూలిపోయాడు గణేశ్. సహచర కార్మికులు అక్కడి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించినా ఫలితం దక్కలేదు. స్వగ్రామానికి చేరిన గణేశ్ మృతదేహానికి అంత్యక్రియలు పూర్తిచేశారు. అంతిమయాత్రలో పాల్గొన్న గల్ఫ్ జేఏసీ నాయకులు.. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

రూ.500కోట్లతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రూ.500కోట్లతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని గల్ఫ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గుగ్గిళ్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. గణేశ్ అంతిమయాత్రలో పాల్గొన్న అనంతరం ఆయన కార్మికులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఉన్న ఊరులో ఉపాధిలేక ఎడారి దేశాలకు వలస వెళ్తున్న కార్మికులు అనేక కారణాలతో మృతి చెందుతున్నారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని అన్నారు. నాయకులు గంగుల మురళీధర్‌రెడ్డి, అనిల్‌రావు తదితరులు పాల్గొన్నారు.